క్లుప్తంగా

ఫ్లెక్సీల తొలగింపు



తొలగించిన ఫ్లెక్సీలను తీసుకెళుతున్న దృశ్యం

ప్రొద్దుటూరు : మున్సిపాలిటీ పరిధిలో అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన అన్ని రకాల ఫ్లెక్సీలను మున్సిపల్ అధికారులు మంగళవారం తొలగించారు. టీడీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఆ పార్టీ నాయకులు ఎలాంటి అనుమతులు లేకుండా పెద్ద ఎత్తున ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఎక్కడపడితే అక్కడ ఫ్లెక్సీలను నెలకొల్పడం జరిగింది. ఇటీవల జరిగిన ఓ సమావేశంలో ఫ్లెక్సీలను తొలగించాలని అధికారులు నిర్ణయించారు. ఆ మేరకు ఫ్లెక్సీలను తొలగించారు.

మొక్కలు నాటండి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎఫ్‌ఆర్‌ఓ

కలసపాడు : ప్రతిఒక్కరు గ్రామాల్లో మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని పోరుమామిళ్ళ ఫారెస్టు రేంజ్ అధికారి రఘునాథరెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని ఎగువ రామాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా అటవీశాఖ అధికారి సందీప్‌రెడ్డి ఆదేశాల మేరకు అమ్మపేరిట ఒక చెట్టు అనే మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. పాఠశాల ఆవరణలో సుమారు 100 వేప, నేరేడు, కానుగ, రావి, గంగిరావి, వెలగ తదితర మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఎఫ్‌ఆర్‌ఓ మాట్లాడుతూ చెట్ల వలన మనిషికి ఉపయోగాలు గురించి తెలిపారు. ప్రతి విద్యార్థి బాధ్యతగా మొక్కలు నాటి పెంచాలన్నారు. అవసరమైన మొక్కలను ఉచితంగా అందజేస్తామన్నారు. అనంతరం ఉపాధ్యాయులు విద్యార్థులచే మొక్కల ఆవశ్యకత, పర్యావరణం గురించి వకృత్వ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మొదటి, రెండవ, మూడవ బహుమతులు ఎఫ్‌ఆర్‌ఓ చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులు, సెక్షన్ అధికారి రమణయ్య, బీట్ అధికారులు, ప్రధానోపాధ్యాయుడు కమాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంత్యక్రియలు



వెంకటమ్మ అంత్యక్రియలు నిర్వహిస్తున్న మే ఐ హెల్ప్ యూ ఫౌండేషన్ ప్రతినిధులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీనివాసనగర్‌కు చెందిన వెంకటమ్మ (49) అనే మహిళ అనారోగ్యంతో మృతి చెందింది. అంత్యక్రియలు నిర్వహించడానికి ఆమె బంధువులు ఎవరు ముందుకు రాకపోవడంతో మే ఐ హెల్ప్ యూ ఫౌండేషన్ మోరే లక్ష్మణరావు స్పందించారు. హిందూ శ్మశాన వాటికలో సంప్రదాయ ప్రకారం వెంకటమ్మ అంత్యక్రియలను మే ఐ హెల్ప్ యూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ పట్టణాధ్యక్షుడు సుభహాన్, ఉపాధ్యక్షుడు మునీంద్ర, సుమన్ బాబు, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



వృద్ధురాలికి నగదును అందజేస్తున్న యాదవ సంఘం నాయకులు

అట్లూరు : మండలంలోని ఎల్లుగారిపల్లె పునరావాస కాలనీలో నివాసం ఉంటున్న మేకల గంగమ్మ తన భర్త అనారోగ్యంతో మృతిచెందడంతో కూలీ పనులు చేసుకుని జీవనం సాగించలేక అవస్థలు పడుతుండేది. కువైట్ యాదవ సంఘం అధ్యక్షుడు చల్లాబాబుయాదవ్, అట్లూరు మండల అధ్యక్షుడు ఆవులపోలు మునెయ్య యాదవ్‌లు వృద్ధురాలి ఖర్చుల నిమిత్తం రూ.30 వేలు నగదును మంగళవారం ఆమెకు అందజేశారు. బద్వేలు నియోజకవర్గ యాదవ సంఘం అధ్యక్షుడు బుర్రిరాజాయాదవ్, మండల యాదవ సంఘం నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కడపలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాలి

కడప ఎడ్యుకేషన్ : నూతనంగా ఏర్పాటైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కడప ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాలని విద్యార్థి యువజన సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు మంగళవారం కడపకు వచ్చేసిన రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని ఆర్ అండ్ బి అతిథి గృహంలో కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న, పీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు, ఎస్‌బిఐబి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయవర్ధన్‌లు మాట్లాడుతూ కడప ఉక్కును నిర్మించడం వల్ల వేలాది మంది నిరుద్యోగులకు ఉపాధి దొరుకుతుందన్నారు. ఈ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

కొండెక్కిన కోడిగుడ్డు ధర

- అదే బాటలోనే చికెన్
- సామాన్యులకు అందని వైనం

కాశినాయన : కోడిగుడ్డు ధర కొండెక్కి కూర్చుంది. ఓ వైపు కూరగాయలు గాయాలు చేస్తున్నాయి. మొన్నటి వరకు పప్పు కంటే చికెన్ బెస్ట్ అన్న వారందరూ ఇప్పుడు ముక్కలు కంటే మొక్కలే బెస్ట్ అంటున్నారు. కోడిగుడ్డు ధరలు, చికెన్ ధరలు అమాంతం పెరిగిపోయాయి. బహిరంగ మార్కెట్‌లో రిటైల్‌గా కోడిగుడ్డు రూ.7లకు విక్రయిస్తున్నారు. మారుమూల గ్రామాల్లో అయితే రూ.8లకు అమ్ముతున్నారు. 30 కోడిగుడ్ల అట్ట ధర రూ.200 అమ్ముతున్నారు. పది రోజుల క్రితం రూ.180లు ఉన్న అట్ట ఒక్కసారిగా పెరిగింది. నిలకడ లేకుడా ప్రతి రోజు గుడ్డు ధర 5 పైసల నుండి 15 పైసల వరకు పెరుగుతుంది. ఇది మరింత పెరుగుతుందని వ్యాపారస్తులు చెబుతున్నారు.

పెరుగుతున్న డిమాండ్



ఆకులనారాయణపల్లె గ్రామంలో కోడిగుడ్లు కొంటున్న మహిళ

రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడీ కేంద్రాల్లో ప్రతి రోజు, అలాగే అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భవతులు, బాలింతలకు కూడా గుడ్లు ఇస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకంలో వారానికి 5 రోజులు, గురుకుల పాఠశాలలు, వసతిగృహాలు, ఇతర ఉన్నత విద్యాసంస్థల్లో ప్రతిరోజు గుడ్లను విద్యార్థులకు అందిస్తున్నారు. పల్లెలు, పట్టణాలు, నగరాల్లో నూడిల్స్ బండ్లు, ఆమ్లెట్లు పెరగడంతో వీటి వాడకం పెరిగింది. దీంతో కోడిగుడ్డుకు డిమాండ్ పెరిగింది. డిమాండ్‌కు తగ్గ ఉత్పత్తి పెరగకపోవడంతో ధర పెరుగుతుందని వ్యాపారస్తులు చెబుతున్నారు. సామాన్యులకు తక్కువ ధరకు లభించే పౌష్టికాహారం కోడిగుడ్డు. ఇప్పుడు కోడిగుడ్డు ధర రోజురోజుకు పెరుగుతుండటంతో గుడ్లను కొనాలంటే సామాన్యులు ఆలోచిస్తున్నారు. కోడిగుడ్డు ధరలతో పాటు కూరగాయల ధరలు కూడా రోజురోజుకు పెరుగుతున్నాయి. అలాగే చికెన్ ధర కూడా కిలో రూ.260లకు చేరింది. దీంతో సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారు. కోడిగుడ్డు ధరలు తగ్గించాలని ప్రజలు కోరుతున్నారు.

ఎరువుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు

గోపవరం : వ్యవసాయశాఖ ప్రత్యేక కమిషనర్ ఆదేశాల మేరకు మంగళవారం బద్వేలు వ్యవసాయ డివిజన్ పరిధిలోని సాయికృష్ణ ట్రేడర్స్, పి.సి.ఎస్.ఆగ్రో ఏజెన్సీస్ ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల దుకాణాలను రాష్ట్ర వ్యవసాయ విజిలెన్స్ అధికారులు ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. లైసెన్స్ గడువు, స్టాకు రిజిస్టర్లలో నిల్వలు, గోడౌన్‌లో నిల్వలు పరిశీలించారు. రసీదు పుస్తకం, ఇన్వాయిస్, వేబిల్స్ అన్నీ కూడా క్షుణ్ణంగా పరిశీలించారు. చట్టబద్ధ వ్యాపారం చేయాలని, ఎప్పటికప్పుడు ధరల స్టాకుబోర్డు వివరాలు ఉంచాలన్నారు. రైతులు కొనుగోలు చేసిన వాటికి రసీదులు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. నాణ్యమైన ఎరువులు, క్రిమిసంహారక మందులు, విత్తనాలు మాత్రమే రైతులకు విక్రయించాలన్నారు. గడువు ముగిసిన ఉత్పాదకాలను ఎట్టిపరిస్థితుల్లో అమ్మరాదన్నారు. రైతుల పూర్తి చిరునామా, మొబైల్ నెంబర్, సంతకాలు, వేలిముద్రలు సేకరించాలన్నారు. ఎరువుల బస్తాల్లో తూకం ఖచ్చితంగా ఉండాలని, లేనిచో చట్టపరమైన చర్యలు తప్పవని డీలర్లను హెచ్చరించారు. ఇకమీదట ఎప్పటికప్పుడు ఆకస్మిక తనిఖీలు ఉంటాయని అధికారులు తెలియజేశారు. కాగా విజిలెన్స్ అధికారులు తనిఖీలకు వస్తున్నట్లు తెలియడంతో కొందరు డీలర్లు దుకాణాలను మూసివేశారు. ఈ తనిఖీల్లో సహాయ వ్యవసాయ సంచాలకులు కె.ఎం.ఈ.ప్రసాద్, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ జి.ఈదురుబాషా, బద్వేలు ఏడీఏ ఎం.నాగరాజు, వ్యవసాయాధికారి జి.రామకృష్ణయ్య, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.



ఎరువుల దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

100 శాతం సబ్సిడీతో పండ్లతోటల పెంపకం

దువ్వూరు : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా వంద శాతం సబ్సిడీతో పండ్లతోటల పెంపకం చేపట్టడానికి ప్రభుత్వం నిర్ణయించిందని ఉపాధి హామీ పథకం ఏపీఓ డాక్టర్ వసంతకుమార్ తెలిపారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఐదు ఎకరాలు, అంతకంటే తక్కువ భూమి ఉన్న చిన్న, సన్నకారు రైతులు వందశాతం సబ్సిడీతో పండ్ల తోటల పెంపకానికి అర్హులని పేర్కొన్నారు. మామిడి, చీని, సన్న నిమ్మ, జామ, సపోట, కొబ్బరి, సీతాఫలం, దానిమ్మ, నేరెడు, ఆపిల్‌బేర్, డ్రాగన్‌ఫ్రూట్ లాంటి పండ్ల తోటలకు మూడేళ్లపాటు ఉచితంగా నిర్వహణ ఖర్చులు చెల్లించడం జరుగుతుందన్నారు. రోజ, మల్లెతోట, మునగతోటల రైతులకు రెండేళ్లపాటు నిర్వహణ ఖర్చులు అందిస్తామని చెప్పారు. నర్సరీ ఏర్పాటు చేసుకుని ఉపాధి హామీద్వారా మొక్కలు పెంచుకునే రైతులకు మూడు నెలల పాటు మొక్కలు పెంచడానికి అయ్యే ఖర్చును ప్రభుత్వం చెల్లిస్తుందని వివరించారు. ఆసక్తిగల రైతులు ఈనెల 20వ తేదీలోపు హార్టికల్చర్ కార్యాలయంలో కానీ, మండల ఉపాధి హామీ పథకం కార్యాలయంలో రఖాస్తు చేసుకోవచ్చన్నారు. రైతులు పట్టాదారు పాస్‌పుస్తకం, ఉపాధి హామీ పథకం జాబ్ కార్డు, వన్ బీ, ఆధార్ కార్డు కాపీలు అందించాలన్నారు.



మాట్లాడుతున్న ఏపీఓ డాక్టర్ వసంతకుమార్

మినుము పంటలో మెళకువలు పాటించాలి

కలసపాడు : మినుము పంటలో మెళకువలు పాటించాలని మండల వ్యవసాయాధికారి జాకీర్‌షరీఫ్ తెలిపారు.

మంగళవారం మండలంలో రైతులు సాగు చేసిన మినుము పంటను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు పడినందున మినుము పంటలో పురుగులు తెగుళ్ళు సోకే అవకాశం ఉందన్నారు. లేత దశలో ఆకులు ఉన్నప్పుడు చిత్తపురుగులు ఆకులపై రంధ్రాలు చేస్తాయని, పేనుబంక మినుములో కాండంపై, పూతపై ఒక పొరలా ఏర్పడి రసం పీలిస్తుంటాయని తెలిపారు. వీటి నివారణకు మోనో‌క్రోటోఫాస్ 1.6 ఎంఎల్ లేదా అసిఫేట్ 1.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. అలాగే పంటకు పల్లాకు తెగులు సోకినప్పుడు మొక్కల ఆకులు పసుపురంగులోకి మారతాయని, ఈ వైరస్ తెల్లదోమ ద్వారా మాత్రమే వ్యాప్తి చెందుతుందన్నారు. దీని నివారణకు ఎసీటమాప్రిడ్ 0.5 గ్రాములు లేదా ఫ్లోనికామిడ్ 0.3 గ్రాములు లేదా డైఫెన్తియురాన్ 0.5 మిల్లీలీటర్లు లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని తెలిపారు.



మినుము పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

అక్రమాలపై విచారణ జరిపించాలి

పోరుమామిళ్ల (అట్లూరు) : కడప డయాసిస్‌లో ఆర్సీఎం మేనేజ్‌మెంట్ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఎయిడెడ్ టీచర్ పోస్టుల భర్తీలో బిషప్ గాలిబాలి నేతృత్వంలోని కమిటీ భారీ కుంభకోణానికి తెరలేపిందని జరిగిన నాలుగున్నర కోట్ల రూపాయల ఆర్థిక లావాదేవీలపై తక్షణమే ప్రభుత్వం జోక్యం చేసుకుని సిట్‌తో విచారణ జరిపించాలన్నారు. బాధ్యులందరిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కథోలిక విలువల సంరక్షణ సమితి కన్వీనర్, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు సగిలి జాకోబ్ డిమాండ్ చేశారు.

మంగళవారం పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో ఈరిబాలజోజి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో కడప డయాసిస్‌లో ఇటీవల జరిగిన అనేక అప్రజాస్వామిక పరిణామాలపై చర్చించారు. ముఖ్యంగా ఎయిడెడ్ పోస్టులను అనర్హులకు కథోలిక సంస్థకు సంబంధంలేని వారికి పెద్ద మొత్తంలో డబ్బుకు అమ్మేయడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జాకోబ్ మాట్లాడుతూ చాలా మంది నిరుద్యోగ ఉపాధ్యాయులు ఇరవై ఏళ్ళుగా ఆర్సీఎం మేనేజ్‌మెంట్ పాఠశాలల్లో 700 జీతానికి ఉపాధ్యాయులుగా నేటికీ పనిచేస్తున్నారన్నారు. సకాలంలో ప్రభుత్వ అనుమతులు కోరడంలో మేనేజ్‌మెంట్ నిర్లక్ష్య వైఖరి వలన చాలా మందికి అన్యాయం జరిగిందన్నారు. దీంతో వయస్సు పైబడి అనర్హులయ్యారని తెలిపారు. హైకోర్టు సూచనల మేరకు ప్రస్తుతం జరుగుతున్న భర్తీలో వయస్సు రీత్యా పైబడిన వారికి న్యాయం చేయకుండా, ప్రస్తుతం పనిచేస్తున్న వారిలో సీనియారిటీ ప్రాతిపదికన లేకుండా, రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించకుండా తప్పుడు రోస్టర్ విధానాలను అవలంభిస్తూ బిషప్ గాలిబాలి నేతృత్వంలోని కమిటీ పోస్టులను పెద్ద ఎత్తున డబ్బులకు అమ్మడం జరిగిందన్నారు. దీనిపై సిట్‌లో విచారణ జరిపి మేనేజ్‌మెంట్ నిర్లక్ష్యంతో వయస్సు రీత్యా అనర్హులైన వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో అక్రమంగా జరిగే పోస్టుల భర్తీని అడ్డుకుంటూ పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో లక్కినేని ఇశ్రాయేలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

'వారాహి'గా శ్రీ బాల పోలేరమ్మకు నవరాత్రులు

కడప కల్చరల్ : కడప నగరం చిన్నబెస్తవీధిలోని శ్రీ బాల పోలేరమ్మ మాతకు ఆషాడ మాసాన్ని పురస్కరించుకుని శ్రీ వారాహి దేవిగా అలంకరించారు. వారం రోజులపాటు దేవీ నవరాత్రి పూజలు వారాహి అలంకారంలోనే నిర్వహించనున్నారు. జిల్లాలో తొలిసారిగా ఈ అలంకారంలో అమ్మవారికి పూజలు నిర్వహించడం విశేషం. ఇందులో భాగంగా మంగళవారం ఆలయంలో అమ్మవారికి విశేష అలంకారం నిర్వహించి లలిత సహస్ర నామ పారాయణాన్ని సామూహికంగా నిర్వహించారు. అనంతరం మహిళా భక్తులు ఆలయ ప్రాంగణంలో కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం అర్చకులు పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.



విశేష అలంకారంలో బాల పోలేరమ్మ తల్లి

నేడు మున్సిపల్ సాధారణ సమావేశం

మైదుకూరు : మైదుకూరు మున్సిపల్ సాధారణ సమావేశాన్ని బుధవారం నిర్వహించనున్నట్లు కమిషనర్ జబ్బార్ మియా ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర అధ్యక్షతన మున్సిపల్ సభాభవనంలో నిర్వహించే మావేశంలో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ పాల్గొంటారని, సభ్యులందరూ సమావేశానికి హాజరు కావాలని కోరారు.

మండల సమావేశం

మైదుకూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్ ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2.30 గంటలకు నిర్వహించే సమావేశంలో అన్ని శాఖల అధికారులు పాల్గొనాల్సిందిగా ఆయన కోరారు.

నేడు ఆందోళనలు

బద్వేలు అర్బన్ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా బుధవారం జిల్లా వ్యాప్తంగా అన్ని మండల తహసీల్దారు కార్యాలయాల వద్ద ఆందోళనలు నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం స్థానిక సుందరయ్య భవనంలో నిర్వహించిన సీఐటీయూ అనుబంధ కార్మిక సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాయడం దుర్మార్గమన్నారు. ఆందోళనలలో ప్రభుత్వ ఉద్యోగులు, కాంట్రాక్టు ఉద్యోగులు, అసంఘటిత రంగ కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

సపోర్టు వైర్ తొలగించడంతో వాలిన విద్యుత్ తీగలు

మైదుకూరు : ఖాజీపేట మండలం నాగసానిపల్లెకు చెందిన రైతు అబ్బయ్య పొలంలో ఒక విద్యుత్ స్తంభానికి అమర్చిన స్టే వైర్ తొలగించడం వల్లే విద్యుత్ తీగలు కిందకి వాలాయని ఖాజీపేట ఇన్‌చార్జి ఏఈ గోవర్ధన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం సోషల్ మీడియాలో రైతు అబ్బయ్య పొలంలో విద్యుత్ తీగలు కిందకి వాలినట్టు వార్త రావడంపై ఏఈ వివరణ ఇచ్చారు. నాగసానిపల్లెలో రైతు అబ్బయ్య పొలంలోని లైన్లు కిందికి వాలి ఉన్న విషయాన్ని తన దృష్టికి ఎవరు తీసుకురాలేదని ఆయన పేర్కొన్నారు. విలేకరుల ద్వారా విషయం తెలియగానే రైతు పొలం వద్దకు వెళ్లి పరిశీలించినట్టు తెలిపారు. స్తంభానికి ఉన్న సపోర్ట్ స్టే వైర్‌ను ఎవరో కట్ చేయడం వల్లే స్తంభం వాలి తీగలు కిందకు వచ్చాయని వివరించారు. యుద్ధ ప్రాతిపదికన కొత్త స్తంభం ఏర్పాటు చేసి, వాలిన లైన్లను సరి చేశామని ఏఈ తెలిపారు. ఇలాంటి లూజ్ లైన్ సమస్యలు ఎక్కడ ఉన్నా మొదట అందుబాటులో ఉన్న సిబ్బందికి కానీ, సచివాలయంలో కానీ తెలియజేయాలని సూచించారు.

శిల్పారామం కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : శిల్పారామంలో పనిచేసే కార్మికుల సమస్యలను పరిష్కరించాలని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్ రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్‌సీపీ బృందం శిల్పారామంలో పర్యటించి కార్మికుల సమస్యలను తెలుసుకున్నారు. రవిశంకర్‌రెడ్డి మాట్లాడుతూ కార్మికులు, సిబ్బంది కనీస వేతనాలకు నోచుకోవడం లేదన్నారు. శిల్పారామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు తగినంత మంది సిబ్బంది లేరన్నారు. కార్మికులందరికీ సమాన హక్కులు కల్పించి సమాన వేతనాన్ని అందించాలని ఆంధ్రప్రదేశ్ శిల్పారామం బాధ్యులు మునిరావు దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన స్పందిస్తూ త్వరలోనే సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి వర్గ సభ్యులు మడగలం ప్రసాద్, రాయలసీమ మహిళా సంఘం జిల్లా కార్యదర్శి తస్లీమ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో పూజలు

కడప కల్చరల్ : కడప నగరం శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం భక్తులు దోష నివారణ కోసం రాహుకాల పూజలను నిర్వహించారు. తెల్లవారుజామున అమ్మవారికి పంచామృతాభిషేకం, పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో రాహుకాల పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేసి తమ కోరికలు నెరవేరాలని మొక్కుకున్నారు.

21న పౌర్ణమి పూజలు..

కాగా ఈనెల 21వ తేదీన ఆషాడ పౌర్ణమిని పురస్కరించుకుని విజయదుర్గమ్మ ఆలయంలో అమ్మవారికి పవిత్ర నదీ జలాలు నింపిన 108 కలశాల నీటితో అష్టోత్తర శతకలశాభిషేకం నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపకులు సుధా మల్లికార్జున రావు, నిర్వాహకులు దుర్గాప్రసాద్‌లు తెలియజేశారు.

ప్రజలకు అవినీతి రహిత పాలన అందించాలి

- పార్టీలకు అతీతంగా కలసి పనిచేద్దాం
- బాలికల ఉన్నత పాఠశాలకు మినరల్ వాటర్ ప్లాంట్
- ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్

ఖాజీపేట : అవినీతి రహిత పాలన ప్రజలకు అందించాలి.. ఎవ్వరు అవినీతికి పాల్పడినా వదిలే ప్రసక్తే లేదని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ అధికారులను హెచ్చరించారు. మండల సర్వసభ్య సమావేశం మంగళవారం సాయంత్రం ఎంపీపీ అబుబకర్ సిద్ధిక్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. మండల వైఎస్సార్ సీపీ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు అందరూ ఆయనను ఘనంగా సత్కరించారు. అనంతరం సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఏ పార్టీ తరుపునైనా గెలిచినా ఫర్వాలేదు.. అందరం ప్రజల కోసం పనిచేద్దాం. మీ సమస్యలు మా దృష్టికి తీసుకు రండి నేను పరిష్కరిస్తానని సభ్యులందరికి పుట్టా హామీ వచ్చారు. బాలికల ఉన్నత పాఠశాలలో కలుషిత నీరు వల్ల ఆసుపత్రి పాలైన విద్యార్థినుల సమస్యపై స్పందించారు. బాలికల ఉన్నత పాఠశాలలో మినరల్ వాటర్ ప్లాంట్‌కు మంజూరుకు ఆదేశించారు. 15 రోజుల్లో పూర్తి చేయాలన్నారు. ఏపీ సీడ్ నుంచి నకిలీ జీలుగలు వస్తున్నాయని బి. కొత్తపల్లె సర్పంచ్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే వాటిని ల్యాబ్‌కు పంపి పరీక్ష నిర్వహించాలన్నారు. నాణ్యత లేకపోతే అమ్మకపు దారులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. మండలంలో మిగులు భూమి ఎంత ఉంది.. అక్రమంగా సాగులో ఉన్న వారి జాబితా సిద్ధం చేయాలని సూచించారు. ప్రతి పంచాయతీలో స్మశాన వాటికల స్థలం నమూనాలు కావాలని, వాటికి హద్దులు వేసి ప్రతి గ్రామంలో స్మశాన వాటిక కట్టించాలని అధికారులకు సూచించారు. సమావేశం అనంతరం పంచాయతీ సెక్రటరీలు ఎమ్మెల్యేని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ దవనం పుష్పలత, ఎంపీటీసీలు కనపర్తి సుబ్బారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, భాస్కర్ రెడ్డి, భార్గవి, ఉప మండలాధ్యక్షురాలు ప్రశాంతి, సర్పంచ్‌లు సుబ్బారెడ్డి, బుజ్జి, చంద్రశేఖర్, యన్నం రాణెమ్మ, వెంకటసుబ్బయ్య, శివరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్

జిల్లా ఆస్పత్రిని అభివృద్ధి చేయండి

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రిని అభివృద్ధి చేయాలని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌ను ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి కోరారు. అమరావతిలోని సచివాలయంలో మంగళవారం ఎమ్మెల్యే వరద మంత్రిని కలిశారు. జిల్లా ఆస్పత్రిలో వైద్యులు, నర్సుల కొరత ఉందని తెలిపారు. కార్పొరేట్ ఆస్పత్రిలా జిల్లా ఆస్పత్రిని అభివృద్ధి చేయాలని కోరారు. ప్రొద్దుటూరుకు మెడికల్ కాలేజీని తీసుకొస్తామని ఎన్నికల ముందు ప్రజలకు హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే గుర్తు చేశారు. ఈ మేరకు చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరినట్లు వరదరాజులరెడ్డి తెలిపారు.



మంత్రి సత్యకుమార్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి

గర్భిణులు పౌష్టికాహారాన్ని తీసుకోవాలి

దువ్వూరు : గర్భిణులు ప్రతి రోజు మంచి పౌష్టికాహారాన్ని తీసుకుంటూ వ్యక్తిగత పరిశుభ్రతను పాటిస్తూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని దువ్వూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అధికారి సురేష్ బాబు తెలిపారు. మంగళవారం దువ్వూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్లు సురేష్‌బాబు, వికసిత, హేమలత గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. గ్రామాల్లో ఉన్న గర్భిణులను గుర్తించి ప్రభుత్వం ఆస్పత్రిలో సుఖప్రసవం అయ్యేటట్లు చూడాలని డాక్టర్లు ఆశా కార్యకర్తలకు తెలిపారు. గర్భిణులు ప్రతి నెల వైద్య పరీక్షలు చేయించుకుని డాక్టర్లు సూచనల మేరకు మందులు వాడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో 80 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు చేశామని, అందులో 31 మంది హై రిస్క్‌లో ఉన్నట్లు గుర్తించామని, వారికి వివిధ రక్త పరీక్షలు చేసి మందులు అందించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు విజయకుమారి, రాజగోపాల్, సువర్ణ, మండలంలో ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.



గర్భిణులకు సూచనలు ఇస్తున్న డాక్టర్ సురేష్‌బాబు

ఘనంగా ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం



మాట్లాడుతున్న ఏబీవీపీ జిల్లా కన్వీనర్ అభిలాష్



శోభాయాత్రలో ఏబీవీపీ నాయకులు

పోరుమామిళ్ల (అట్లూరు) : అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఏబీవీపీ 76వ ఆవిర్భావ దినోత్సవాన్ని పోరుమామిళ్ల పట్టణశాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. వివేకానంద భవన్ వద్ద ఏబీవీపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పట్టణంలోని వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ జిల్లా కన్వీనర్ అభిలాష్ మాట్లాడుతూ నిరంతరం విద్యార్థుల సమస్యలపై పోరాటం చేస్తున్న ఏకైక విద్యార్థి సంఘం ఏబీవీపీ అన్నారు. 1949 జూలై 9న ఢిల్లీ యూనివర్శిటీలో 5 మంది విద్యార్థులతో ప్రారంభించిన ఏబీవీపీ ఈ రోజు 50 లక్షలకు పైగా సభ్యత్వం కలిగిన అతిపెద్ద విద్యార్థి సంఘం ఏబీవీపీ అన్నారు. కార్యక్రమంలో సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా ప్రముఖ్ బాలరంగయ్య, సమరసత సేవ ఫౌండేషన్ ప్రముఖ్ శ్రీనివాసులురెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

శోభాయాత్ర

ప్రొద్దుటూరు : అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) 76వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం పట్టణంలో శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కోడూరు మల్లికార్జున మాట్లాడుతూ స్వామి వివేకానంద చెప్పిన 'విద్య జీవితం కోసం జీవితం దేశం కోసం' మాటలే బాటగా ఏబీవీపీ 75 ఏళ్లుగా సమస్యలపై పోరాటం చేస్తోందన్నారు. విద్యార్థులకు ఏ సమస్య వచ్చినా తనదైన శైలిలో ఏబీవీపీ నిర్మాణాత్మక ఉద్యమాలు చేపడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ ప్రొద్దుటూరు భాగ్ కన్వీనర్ శరణ్‌కుమార్, నగర కార్యదర్శి వివనారాయణ, హాస్టల్ కన్వీనర్ శ్రవణ్, సోషల్ మీడియా కన్వీనర్ సోహైల్, ఎస్ఎఫ్ఎస్ కన్వీనర్ వెంకటేష్, మహేష్‌బాబు, సంతోష్, అభినయ్ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు వైద్య పరీక్షలు చేయించుకోవాలి

చాపాడు : గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని, అలాగే వైద్య సిబ్బంది సూచనలు పాటిస్తూ సంపూర్ణ పౌష్టికాహారం తీసుకోవాలని మండల వైద్యాధికారి డా.రాజేష్‌కుమార్ అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ప్రధాన మంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వైద్యులతో పాటు ప్రముఖ గైనకాలజీస్టు జ్యోతి గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి రాజేష్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆసుపత్రులలోనే ప్రసవాలు చేయించుకోవడం శ్రేయస్కరమన్నారు. అనీమియా ఉన్న గర్భిణులు ఐరన్ సుక్రోజ్ సూదులు వేయించుకోవాలన్నారు. రక్త పరీక్షలు చేయించుకుని దానికి అనుగుణంగా సంపూర్ణ పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మండలంలోని 70 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి తగిన సలహాలు, సూచనలు చేసినట్లు వైద్యాధికారి తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారులు శ్రీవాణి, కావ్య మాధురి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



గర్భిణులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారులు

బీసీ బాలికల హాస్టల్‌ను త్వరలో పునఃప్రారంభిస్తాం

ప్రొద్దుటూరు : పట్టణంలో బీసీ బాలికల హాస్టల్‌ను త్వరలో పునఃప్రారంభిస్తామని జమ్మలమడుగు డివిజన్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ కృష్ణయ్య తెలిపారు. ఆయన మంగళవారం అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ ఆవరణలోని నైట్ షెల్టర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో అద్దె గదుల్లో ఉన్న బీసీ బాలికల హైస్కూల్ పడిపోయిందన్నారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న నైట్ షెల్టర్‌లో హాస్టల్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. త్వరలో ఎమ్మెల్యే వరదరాజులరెడ్డితో చర్చించి హాస్టల్‌ను పునః ప్రారంభిస్తామని తెలిపారు. ప్రొద్దుటూరు నియోజకవర్గ అభివృద్ధి వేదిక కన్వీనర్ నాగరాజు మాట్లాడుతూ సోమవారం తాము తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయడంతోనే బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ ఇక్కడికి వచ్చారన్నారు. ఇప్పటికే హాస్టల్ లేక విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ వెంట వార్డెన్ సత్యవతి ఉన్నారు.



నైట్ షెల్టర్‌ను పరిశీలిస్తున్న బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ కృష్ణయ్య